అంతులేని అవకతవకలు

మహిళా సమాఖ్యల్లో అటకెక్కిన అధికారుల పర్యవేక్షణ

అమలు కాని సంఘాల నియమావళి

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం

అధికారుల నిర్లక్ష్యంతోనే పురపాలికల్లోని మెప్మా పరిధి మహిళా సంఘాల సమాఖ్యలు, మహిళా సంఘాల్లో భారీఎత్తున అవకతవకలు జరుగుతున్నాయి. సంఘాలను సీవోలు, డీఎంసీలు పర్యవేక్షించాలి. వారు ఎలా పనిచేస్తున్నారో మెప్మా పీడీలు, పుర కమిషనర్లు ప్రతి మూడు మాసాలకు ఒకసారి సమీక్షించాలి. ఈ రెండంచెల విధానం పదేళ్లుగా మరుగున పడటంతో సంఘాలు, సమాఖ్యల్లో ఆర్థిక నేరాలు చోటు చేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల పరిధిలో 457 మహిళా సంఘాల సమాఖ్యలు ఉండగా వాటి పరిధిలో 11,367 సంఘాలు ఉన్నాయి. సభ్యులుగా ఉన్న 4,13,670 మంది మహిళలు ప్రతి నెలా రూ.4,13,67,000 వరకు పొదుపు చేస్తున్నారు. ఈ పొదుపును బట్టే బ్యాంకులు, స్త్రీనిధి బ్యాంకులు మహిళలకు వ్యక్తిగత, సామూహిక రుణాలు ఇస్తున్నాయి. ఆర్పీలు, సమాఖ్యల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి(ఓబీలు) మహిళలను తప్పుదోవ పట్టిస్తూ రుణంగా వస్తున్న రూ.లక్షల డబ్బు కాజేస్తున్నారు. బ్యాంకు నోటీ సులదుకుని అమాయక మహిళలు రోడ్డున పడుతున్నారు.

పాతుకుపోయిన ఆర్పీలు, సీవోలు : ఆర్పీలను రెండు, మూడేళ్లకోసారి మార్చాలన్నది మెప్మా నియమావళిలోనే ఉన్నా పాతికేళ్లుగా అమలు కావటం లేదు. అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి(ఓబీల)ను మాత్రమే మారుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 457 ఆర్పీలు, 914 ఓబీలు పని చేస్తున్నారు. మహబూబ్‌నగర్‌లో ఆర్పీలు ఏళ్లుగా పాతుకుపోవడం వల్ల భారీగా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. 94 సమాఖ్యలకు 94 మంది ఆర్పీలు ఉండగా సగానికి పైగా మంది ఆరోపణలు ఎదుర్కొంటున్నవారే. అక్రమాలకు పాల్పడిన ఓ ఆర్పీ మూడేళ్ల క్రితం అదృశ్యమయ్యారు. ఇటీవల మరో ముగ్గురి నుంచి డబ్బుల రికవరీకి ఆదేశించటంతో వారు విధుల నుంచి తప్పుకొని ముఖం చాటేశారు. తాజాగా కోయనగర్ ఆర్పీ కూడా రూ.1.49 కోట్ల వరకు అవకతవకలు చేసినటుల తేలగా మహిళలు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీవోను అధికారులు సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో గుమ్మడి కాయల దొంగలు అంటే భుజాలు తడుముకున్నట్లు అవకతవకలు చేసిన ఆర్పీలు తమపై ఎక్కడ చర్యలు తీసుకుంటారోనని ఎమ్మెల్యేను, పురపాలిక ఛైర్మన్‌ను తరచూ కలుస్తూ సంజాయిషీలు ఇస్తున్నారు. మిగతా సమాఖ్యల్లోనూ అధికారులు పకడ్బందీగా విచారణ జరిపిస్తే భారీ మొత్తంలో అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంటుందని మహిళలు చెబుతున్నారు. ఆర్పీల లాగే సీవోలను కూడా ప్రతి మూడేళ్లకు ఒకసారి వార్డులు మార్చాల్సి ఉన్నా చేయటం లేదు. ఏళ్ల తరబడిగా పాతుకుపోవటంతో ఆర్పీలు, ఓబీలతో సంబంధాలు బలపడి ఆర్థిక అవకతవకలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇకనైనా ఆర్పీలను తొలగించి మహిళా సంఘాల తీర్మానంతో కొత్త వారిని నియమించాలని, సీవోలను బదిలీ చేయాలని మహిళలు కోరుతున్నారు.


కోయనగర్ సమాఖ్య లావాదేవీల్లో అవకతవకలు తనిఖీ చేస్తున్న సీవోలు, ఆర్పీల బృందం

మొక్కుబడిగా ఏజెన్సీల ఆడిట్ : సమాఖ్యల ఆడిట్‌ను ఏటా స్థానికంగా ప్రైవేటు ఏజెన్సీలతో చేయిస్తున్నారు. ఆర్పీలు బ్యాంకర్లకు సమర్పించే సూక్ష్మ రుణ ప్రణాళిక దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించి సమాఖ్యల్లోని ఒక్కో సంఘానికి ఏడాదిలో ఎంత రుణం మంజూరైంది.. రుణాలు తీసుకుంటున్న మహిళలు సంఘాల సభ్యులేనా.. సంతకాలు వారివేనా.. రుణం తిరిగి చెల్లిస్తున్నారా.. లేదా అనేది తేల్చాలి. అలా చేయటం లేదు. ఆర్పీలు, ఓబీలు ఇచ్చే దస్త్రాలనే పరిశీలించి ఒకటి, రెండు రోజుల్లో ఆడిట్ పూర్తిచేస్తున్నారు. ఇప్పటివరకు ఒక్క అక్రమాన్నీ గుర్తించిన దాఖలాలు లేవు. మెప్మా ఉన్నతాధికారులు కూడా ఏటా సమాఖ్యల ఆడిట్‌కు ప్రధాన కార్యాలయం నుంచే అగ్రశ్రేణి ఆడిటర్లను పంపించాల్సి ఉన్నా చేయటం లేదు.

సంపద వనం.. మొక్కలు కనం!

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : జలాశయాల వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున సంపద వనాల పేరుతో మొక్కలను నాటినా.. నిర్వహణ లేక లక్ష్యం నీరుగారుతోంది. ఏడాది క్రితం పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల వద్ద ఏర్పాటు చేసిన దశాబ్ది సంపద వనాలు గడ్డిలో కలిసిపోయాయి. నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెర శివారులో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపుహౌజ్, జలాశయం వద్ద సంపద వనాన్ని ఏర్పాటు చేశారు. ఎకరానికి 800 మొక్కల చొప్పున నాటారు. కుమ్మెర పంపుహౌజ్ వద్ద 38 ఎకరాల్లో మొక్కలు నాటారు. మొక్కలు నాటిన తర్వాత మళ్లీ పట్టించుకోలేదు. ఫలితంగా కొన్ని ఎండిపోగా మరికొన్ని పూర్తిగా గడ్డిలో కలిసిపోయాయి. ఒక్క మొక్క కనిపించక పోవడంతో సంపద వనం బోర్డుకే పరిమితమైంది. ఉపాధి హామీ పథకం కూలీలతోనైనా మొక్కలకు నీటిని పట్టించడం, సంరక్షణ చర్యలు చేపట్టలేదు. జలాశయాల్లో పనిచేసే ప్రాజెక్టు అధికారులు, గుత్తేదారులు వాటిపైపు చూడలేదు. దీంతో అవన్నీ మొక్కుబడిగా మారాయి.



కుమ్మెర వద్ద పాలమూరు - రంగారెడ్డి పంపుహౌస్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సంపద వనం బోర్డు

మండలం	జలాశయం	నాటిన మొక్కలు ఎకరాల్లో..
బిజినేపల్లి	వెంకటాద్రి	27
బిజినేపల్లి	కుమ్మెర పంపుహౌజ్	38
కొల్లాపూర్	ఎల్లూరు	3
జొన్నలబొగుడ కేఎల్ఐ రెండో లిఫ్టు		25
ఏదుల (పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు)		42

సంరక్షణకు చర్యలు..

జలాశయాల వద్ద స్థల లభ్యత దృష్ట్యా అక్కడ అధికంగా మొక్కలు నాటే ప్రక్రియను గతేడాది చేపట్టాం. కొన్ని ప్రాజెక్టుల పరిధిలోకి కూలీలు, ఇతరులు వెళ్లేందుకు కొన్నిసార్లు అనుమతి ఉండదు. బ్లాస్టింగ్ పనుల దృష్ట్యా ముందస్తు అనుమతి తప్పనిసరి. అయినా మొక్కలను సంరక్షించాలని ప్రాజెక్టు సిబ్బందికి సూచించాం. జలాశయాల ప్రాంతాల్లో ఉండే గ్రామీణాభివృద్ధి సిబ్బంది నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపడతాం.

- చిన్న ఓబులేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, నాగర్‌కర్నూల్

స్వయంకృషే ఉన్నత శిఖరాలకు సోపానం

ఎస్బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి

వనపర్తి పట్టణం: యువతీ యువకులు చాలా మంది యువత ఉన్నత స్థాయికి చేరాలంటే పైరవీలు చేయాలన్న అపోహతో ఉన్నారని, దీన్నుంచి బయటపడాలని ఎస్బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి అన్నారు. పనినే నమ్ముకుని ఉన్నత స్థాయికి చేరవచ్చనేందుకు తానే ఉదాహరణ అని పేర్కొన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన ఆదివారం తొలిసారిగా పాలమూరు గడ్డకు వచ్చారు. పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామానికి చెందిన ఈయన తన కుటుంబ సభ్యుడు చల్లా విజయ్‌కుమార్ వనపర్తి పాత గంజి లక్ష్మీణపతి ఆలయంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. సీఎస్ఆర్ నిధులతో వనపర్తి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. గట్టు మండలానికి కేటాయించిన ఎస్బీఐ సంజీవని క్లినిక్ అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఎంపీ మల్లురవి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, రాజేశ్ రెడ్డి, కలెక్టర్లు ఆదర్శ్ సురభి, బీఎం సంతోష్, బదావత్ సంతోష్ కుమార్ శ్రీనివాసులు శెట్టిని ఘనంగా సన్మానించారు.



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎస్బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి దంపతులు. చిత్రంలో ఎంపీ మల్లురవి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

పత్తి అమ్మకానికి దారేదీ?

ఆన్‌లైన్‌లో నమోదు కాక కౌలురైతులకు పాట్లు



మహబూబ్‌నగర్, ఈనాడు, న్యూస్‌టుడే, కల్వకుర్తి : ఉమ్మడి జిల్లాలో 2,87,625 మంది చిన్న, సన్నకారు రైతులు, 26,760 మంది కౌలు రైతులు ఉన్నారు. ఇందులో 70 శాతం వరకు రైతులు తమ సొంత భూమితో పాటు మరికొంత కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 6.08 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా సుమారు 30 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం పత్తి చేతికి వస్తోంది. బయటి మార్కెట్‌లో పత్తి పంటకు సరైన ధర రావటం లేదు. ఈసారి క్వింటా పత్తికి సీసీఐ రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. సీసీఐ కేంద్రాల్లో విక్రయించి ఆ ధర పొందుదామంటే సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. రైతులకు ఏం చేయాలో పాలు పోవటం లేదు.

సాంకేతిక సమస్యలు : వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు క్షేత్రస్థాయిలో ఏ పంటలు, ఎవరు సాగు చేశారో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కౌలు రైతు పత్తి సాగుచేసిన చోట కూడా పట్టాదారు పేరునే నమోదు చేశారు. దళారుల కట్టడికి వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పంట సాగు చేసినట్లు ఎవరి పేరు నమోదు చేసి ఉంటే వారి ఆధార్ కార్డు, బ్యాంకు, పాసు పుస్తకం తీసుకెళ్తేనే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తోంది. కౌలు రైతులు సీసీఐకి వెళ్లి పత్తి పంట అమ్ముకోవాలంటే పట్టాదారు ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకంతో కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుంది. ఇందుకు పట్టాదారులు అంగీకరించటం లేదు. ఈ పరిస్థితిలో కౌలు రైతులు తమ పంట మద్దతు ధరకు ఎలా అమ్ముకోవాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు.

గత్యంతరం లేక ప్రైవేటుకు : ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోలుకు సీసీఐ 28 జిన్నింగ్ మిల్లులను గుర్తించింది. ప్రస్తుతం అన్ని జిన్నింగ్ మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని సీసీఐ అధికారులు చెబుతున్నారు. రైతులు తీసుకొచ్చే పత్తిని మాత్రం తేమ శాతం 8 నుంచి 12 మధ్యలో లేదని, ఇతర కారణాలు చెప్పి కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నారు. గత్యంతరం లేక జిన్నింగ్ మిల్లు వాళ్లకే తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోంది. కొన్ని చోట్ల జిన్నింగ్ మిల్లులకు సీసీఐ అధికారులే పరోక్షంగా సహకరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.


పాలమూరులో ఓ జిన్నింగ్ మిల్లు వద్దకు పత్తితో వచ్చిన వాహనాలు

గ్రామాల్లోకి దళారులు.. : సీసీఐ కేంద్రాల్లో చాలా మంది కౌలు రైతుల పత్తి కొనుగోలు చేయకపోవటంతో దళారుల దృష్టి వారిపై పడింది. ఇప్పటికే గ్రామాల్లో అడ్డావేసి తాము పంటను కొనుగోలు చేసి వెంటనే డబ్బులు ఇస్తామని చెబుతున్నారు. పంట తడిసిందని, తేమ శాతం ఎక్కువగా ఉందని క్వింటాకు రూ.4,500 నుంచి రూ.6వేలే ధర చెల్లిస్తున్నారు. దీనిపై సీసీఐ మహబూబ్‌నగర్ డీజీఎం మహేశ్వర్‌రెడ్డిని 'ఈనాడు' సంప్రదించగా వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పత్తి సాగు చేసినట్లు నమోదైన వారు ఆధార్, బ్యాంకు పాసు పుస్తకంతో పంట తీసుకొస్తే కొనుగోలు చేస్తామని చెప్పారు. వారు కౌలు రైతా, పట్టా రైతా అనేది తాము చూడమని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్ మాట్లాడుతూ.. సాగులో కౌలు రైతు ఉన్నా పట్టాదారు పేరునే నమోదు చేస్తామని వెల్లడించారు. పట్టాదారుడితో కౌలుదారులు సమన్వయం చేసుకుని వారి పంట విక్రయించుకోవాలని పేర్కొన్నారు.

వట్టెంలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రత్యేక పూజలు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : వట్టెంలోని వెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న బాలకృష్ణారెడ్డి, తదితరులు

సొంతూరులో ఘన సన్మానం..

తాడూరు : రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, ఆచార్య డా. బాలకిష్టారెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆదివారం మొదటిసారిగా ఆయన స్వగ్రామమైన పర్వతాయిపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బాలకిష్టారెడ్డిని ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ పథకాలు యువతకు చేరువ చేద్దాం

ఎంపీ మల్లురవి


నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు నిరుద్యోగ యువతకు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ మల్లురవి అన్నారు. ఆదివారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 22న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన అవకాశాలపై అవగాహన సదస్సు ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలు, రుణాలు, రాయితీలతోపాటు యువత వ్యాపారవేత్తలుగా మారే అవకాశాలను వివరిస్తారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభ్యున్నతికి బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఈనెల 22న నిర్వహించే సదస్సు విజయవంతం చేసేలా జిల్లా అధికారులందరు కృషి చేయాలన్నారు. సదస్సులో స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే డా. రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా అధికారులు చూడాలన్నారు. సమావేశంలో డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవసహాయం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ. 2,411

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం మొక్కజొన్న క్రయవిక్రయాలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన 20 మంది రైతులు 287.50 క్వింటాళ్ల (575 బస్తాలు) మొక్కజొన్న ధాన్యం అమ్మకానికి తెచ్చారు. క్వింటా గరిష్ఠ ధర రూ. 2,411, కనిష్ఠ ధర రూ. 1,711 వంతున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారని మార్కెట్ కార్యదర్శి నరసింహులు తెలిపారు.

నేటి నుంచి ఎస్ఏ-1 పరీక్షలు



అచ్చంపేట, న్యూస్‌టుడే : సంగ్రహణాత్మక మూల్యాంకనం (ఎస్ఏ)-1 పరీక్షలు ఉమ్మడి జిల్లాలో సోమవారం ప్రారంభం కానున్నాయి. అన్ని జిల్లాల్లో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఐదు జిల్లాల్లో డీఈవోల ఆధ్వర్యంలో డీసీఈబీ కార్యదర్శులు పరీక్షలను పర్యవేక్షించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని 4,187 పాఠశాలల్లో 1-10 తరగతి చదువుతున్న 5,42,536 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. పాఠశాల విద్యాశాఖ పరీక్షల నిర్వహణకు ఇప్పటికే కాలపట్టికను తయారు చేసి పాఠశాలలకు డీఈవోల ద్వారా పంపింది. ఈ నెల 21 నుంచి 28 వరకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహించనున్నారు.

జిల్లా వివరాలు..

ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	విద్యార్థులు
638	218	236	1,17,790

పాఠశాలలకు చేరిన ప్రశ్నపత్రాలు..

ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణకు అవసరమైన ప్రశ్నపత్రాలను ఆయా జిల్లాల ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) ద్వారా ఎంఈవోలకు అందజేశారు. మండల వనరుల కేంద్రాల నుంచి హెచ్ఎంలు పాఠశాలలకు ప్రశ్నపత్రాలు తీసుకెళ్లారు. ఉదయం 6, 8, 10 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 7, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ నెల 21 నుంచి 24 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 6, 8 తరగతుల విద్యార్థులకు ఈ నెల 21 నుంచి 28 వరకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 7, 9 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, పదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

శ్రీశైలం జలాశయం వద్ద సందడి


జలాశయం ఆరు గేట్ల ద్వారా దిగువకు వదులుతున్న నీరు

శ్రీశైలం ప్రాజెక్టు (అమ్రాబాద్), న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతుండటంతో ఆ దృశ్యాన్ని తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. దీంతో ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు జలాశయం దృశ్యకేంద్రం వద్ద ఆగుతున్నారు. నీటి పరవళ్లను తిలకించి కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి స్వీయచిత్రాలు తీసుకుంటున్నారు. ఆదివారం సెలవు కావటంతో పర్యాటకులు అధికసంఖ్యలో తరలి వచ్చారు.

పరేడ్ మైదానంలో ఏర్పాట్లు

కందనూలు, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ పట్టణంలోని జిల్లా పాత పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించడానికి సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ముఖ్య అతిథిగా హాజరై పోలీసు అమరవీరులకు నివాళి అర్పించనున్నారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడనున్నారు. ఏర్పాట్లును పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

వానొస్తే ఆ గ్రామాలకు రాకపోకలు బంద్

వంతెనలు లేక ప్రజలు అవస్థ


కోడేరు- పసుపుల వాగు సెప్టెంబర్‌లో పొంగడంతో నిలిచిపోయిన రైతులు

కోడేరు, కొల్లాపూర్, న్యూస్‌టుడే : రోడ్డు భవనాల శాఖ రహదారులపై వంతెనల నిర్మాణానికి రూ. కోట్ల నిధులు మంజూరు చేసినా ఫలితం లేకుండా పోయింది. టెండర్లు దక్కించుకొన్న కొందరు గుత్తేదారులు నిర్మాణ పనులు చేపట్టడంలేదు. మరికొందరు ఒప్పందం చేసుకోకుండా జాప్యం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచి పోతున్నాయి. అయినా అధికారులు స్పందించడం లేదు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట నియోజక వర్గాల్లోని కొన్ని మండలాల్లో వంతెనలు లేక ప్రజలు, వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు.

రూ. కోట్ల నిధులున్నా.. : నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట నియోజక వర్గాల్లోని కొన్ని మండలాల్లోని వాగుల సమీపంలోని గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా రహదారులు, భవనాల శాఖ పరిధిలో పెద్ద వంతెనల (హైలెవల్) నిర్మాణానికి 2023-24లో రూ. 84 కోట్ల నిధులు మంజూరు చేశారు. టెండర్లలో పనులు దక్కించుకున్న గుత్తేదారులు ఎనిమిది నెలలవుతున్నా.. నిర్మాణాలు ప్రారంభించడం లేదు. టెండర్లు పిలిచిన ర.భ. శాఖ అధికారులు చొరవ చూపడం లేదన్న విమర్శలున్నాయి.

ఒప్పంద దశ వీడలే..: కోడేరు-పెద్దకొత్తపల్లి మండలాల మధ్యన బావాయిపల్లి డ్యాం వాగు 2023లో రూ.6 కోట్లు నిధులు మంజూరు చేశారు. పనులు పొందిన గుత్తేదారు ఇప్పటికీ ఒప్పందం చేసుకోలేదు. ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. గత నెలలో వాగు పొంగితే 3 కిలో మీటర్ల ఉంటే 30 కిలో మీటర్లు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఏకంగా వాగుదాటకుండా అధికారులు కంపచెట్లు అడ్డుగా పెట్టి రాకపోకలు బంద్ చేశారు.

మూడు మండలాల ప్రజలకు అవస్థలు.. : కల్వకుర్తి-తెల్కపల్లి దారిలో రఘుపతిపేట వద్ద దుందుభి వాగుపై వంతెన నిర్మాణానికి 2023లో రూ. 43 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికీ పనులు మొదలు పెట్టలేదు. కల్వకుర్తి, తెల్కపల్లి, లింగాల మూడు మండలాలకు రాకపోకలు బంద్ అయింది. 30 కిలో మీటర్ల దూరం వెళ్లేందుకు అదనంగా మరో 60 కిలో మీటర్లు తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది.

దూరాభారం..

ఉప్పునుంతల- వంగూరు మడలం మొల్గర- ఉల్పర గ్రామాల మధ్య దుందుభి వాగుపై వంతెన 2024లో రూ. 35 కోట్లు నిధులు మంజూరు 6 గ్రామాలకు రాకపోకలునిలిచాయి. 3 కిలో మీటర్ల దూరం చేరేందుకు చట్టూ తిరిగి 20 కిలో మీటర్ల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది.

అంచనాలు వేశారంతే..

అచ్చంపేట-దేవరకొండ మధ్యన ఉన్న దారిపై మన్నెవారిపల్లి - దేవరకొండ వాగు 2022లో అంచనాలు వేసి వదిలేశారు. వర్షాలు వచ్చినప్పుడల్లా 8 గ్రామాలకు రాకపోకలు ఆగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 15 కిలో మీటర్లకు పోవాల్సిన గ్రామాలకు 100 కిలో మీటర్లు తిరిగి పోవాల్సి వచ్చింది.

దృష్టి సారిస్తాం.. : జిల్లాలోని పెండింగ్ పనులను ఇప్పటికే పరిశీలించాం. ప్రధాన దారులపై హైలెవల్ వంతెనల నిర్మాణం సమస్య ఉంది. పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. వంతెనలు కావాల్సి వద్ద అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపుతాం. ప్రజల సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తాం.

- నరేందర్, ర.భ శాఖ ఈఈ, నాగర్‌కర్నూల్

అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందండిలా..



ధరూరు, న్యూస్‌టుడే: విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం విదేశాలకు వెళ్లే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. విదేశాలలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన శిక్షలు ఉంటాయి. ఈ క్రమంలో విదేశాలకు వెళ్లే వారిలో చాలా మంది అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ (ఐడీఎల్) కోసం రవాణా శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అవగాహన లేక దళారులను ఆశ్రయించి అధిక మొత్తం సొమ్ము ఖర్చు చేసుకుంటున్నారు. అసలు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఎలా పొందాలంటే..

మీ కోసం



అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ నమూనా

విద్య కోసం: ఉన్నత విద్య అభ్యసించటానికి అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, రష్యాతో పాటు పలు దేశాలకు వెళ్తుంటారు. ఆయా దేశాలకు వెళ్లిన వారు గ్రీన్ కార్డు హోల్డర్లుగా మారి అక్కడే స్థిర పడుతుండగా మరి కొందరు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆయా దేశాలలో కారు తప్పనిసరి అయ్యింది. ఈక్రమంలో చాలా మంది ఐడీఎల్‌ను తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

లెర్నింగ్ మాదిరిగా..: రాష్ట్ర రవాణా శాఖ జారీ చేసే అంతర్జాతీయ లైసెన్స్ ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. ఆయా దేశాల వాహనాలు నడపటానికి అనుమతి ఇస్తారు. ఒక రకంగా చెప్పాలంటే మనదేశంలో పొందిన ఐడీఎల్ ఆయా దేశాల్లో ఏడాది కాలం లెర్నింగ్ లైసెన్స్‌గా చెల్లుబాటవుతుంది. నిబంధనలకు లోబడి గడువులోగా అక్కడి డ్రైవింగ్ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.

పొందడం ఇలా

- అంతర్జాతీయ లైసెన్స్ పొందాలంటే ముందుగా స్వదేశంలో డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. ఐడీఎల్‌కు దరఖాస్తు చేసే సమయంలో ఇక్కడి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పాస్‌పోర్టు (కనీసం 6 నెలల గడువుతో) మనం ఏ దేశానికి వెళ్తున్నామో దానికి సంబంధించిన వీసా జతచేయాలి. వీసా తర్వాత వస్తుందని అనుకుంటే అందుకు సంబంధించిన ఇతర ఆధారాలు అందజేయాలి.
- ఆరోగ్య పరంగా వైద్య ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. ఫాం-ఎ జతచేసి పూర్తి వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. కేటాయించిన తేదీన ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. అన్ని సక్రమంగా ఉంటే ఐడీఎల్ జారీ చేస్తారు.
- ఉమ్మడి జిల్లాలో గత ఐదేళ్ల వ్యవధిలో ఇప్పటి వరకు 1,250 వరకు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సులు తీసుకున్నారు.


అమెరికాలో నిబంధనలు కఠినం: అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే కఠిన నిబంధనలుంటాయి. మనదేశంలో మాదిరిగానే లెర్నింగ్ లైసెన్స్ తీసుకోవటానికి ముందు టెస్ట్ ఉంటుంది. అందులో ఉత్తీర్ణులైతేనే లైసెన్స్ జారీ చేస్తారు. అనంతరం డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణ అనంతరం కూడా టెస్ట్ రాయాలి. డ్రైవింగ్ పరీక్ష నిర్వహించే సమయంలో ఎంవీఐ పక్కన కూర్చుని మన డ్రైవింగ్‌ను పరిశీలిస్తారు. సెన్సార్ల ద్వారా మన ఛోదనను పరిశీలించి ఫొటోలు కూడా తీస్తారు. డ్రైవింగ్ చేసే సమయంలో ఏవైనా పొరపాట్లు చేస్తే వాటికి రుజువు చూపుతూ లైసెన్స్ జారీని తిరస్కరిస్తారు.

మనింట్లోనూ స్మార్ట్ జాంబీలు

- బాని'సెల్' అవుతున్న చిన్నారులు
- వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు

అన్నం తినడానికి, అల్లరి చేయకుండా కుదురుగా కూర్చోవడానికి గద్వాల పట్టణానికి చెందిన ఓ తల్లి కుమారుడికి చరవాణి ఇచ్చేది. ఒకటో తరగతికి వచ్చిన ఆ పిల్లాడు ప్రస్తుతం ఫోన్ ఇవ్వకపోతే అందరినీ కొడుతున్నాడు. గట్టిగా ఏడుస్తున్నాడు. చేసేది లేక మానసిక వైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించారు.


ఉమ్మడి జిల్లాలో ఓ మండలానికి చెందిన ఏడో తరగతి బాలుడు ఇంట్లో అందరూ నిద్రించాక రాత్రి ఎప్పుడు మెలకువ వస్తే అప్పుడు, తండ్రి ఫోన్ తీసుకొని గంటల తరబడి వాడటంతో ఆలస్యంగా నిద్రలేచేవాడు. దీనివల్ల కంటి సమస్య, చికాకు, నీరసం వంటి సమస్యలు వచ్చి చదువులో వెనుకబడ్డాడు.



రాజోలి, న్యూస్‌టుడే: పాలు తాగే పిల్లలు ఆకలితో ఏడిస్తే కన్నతల్లి దగ్గరకు తీసుకొని కడుపు నింపేది. భయంతో ఏడిస్తే నేనున్నాని భరోసా నింపుతూ ఎత్తుకొని లాలించేవారు. చందమామను చూపిస్తూ.. గోరు ముద్దలు తినిపించే వారు.. కథలు చెబుతూ.. పాటలు పాడుతూ నిద్ర పుచ్చేవారు. స్మార్ట్‌ఫోన్ పుణ్యమాని ఇవన్నీ మాయమైపోయాయి. ఆప్యాయతలు, ప్రేమానురాగాలు నెమ్మదిగా కనుమరుగవుతున్నాయి. పిల్లాడు మారాం చేస్తే చాలు సెల్‌ఫోన్ చేతిలో పెడితే ఏడుపు ఆగిపోతోంది. పిల్లలు గంటల తరబడి స్క్రీన్ టైం గడుపుతూ వాటికి బానిసలై 'స్మార్ట్ జాంబీలు'గా మారిపోతున్నారు. ఆటలు ఆడుతూ గడపాల్సిన బాల్యం, చరవాణిలో బందీ అవుతోంది.

ఇవీ అనర్థాలు : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులు మానసిక వైద్యుల వద్దకు తీసుకొస్తున్న పిల్లల్లో సింహభాగం సెల్‌ఫోన్ బాధితులే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పిల్లలు రోజూ 3 - 4 గంటలు చరవాణి చూడటం వల్ల మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, 5 ఏళ్ల లోపు చిన్నారులు రోజుకు ఒక గంట కంటే ఎక్కువ ఫోన్ చూడకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. స్మార్ట్ స్క్రీన్ నుంచి విడుదలయ్యే బ్లూ లైట్ వారి కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోందని, రేడియేషన్ ప్రభావంతో నెగిటివ్ ప్రభావం చూపుతోందని వైద్యులు చెబుతున్నారు.

10 నుంచి 15 ఏళ్లలోపు 100 మంది పిల్లల సర్వేలో తేలిన అంశాలివి



సర్వేలు, పరిశోధనలు చెబుతున్న నిజాలివి



- ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లల్లో 99 శాతం మంది మొబైల్‌ఫోన్లు, గాడ్జెట్‌లకు అలవాటు పడుతున్నారు.
- దేశంలో 66 శాతం మంది తల్లిదండ్రులకు తమ పిల్లలు అధిక స్క్రీన్ సమయం వెచ్చిస్తుండటం ప్రమాదకరమని తెలియదు.



- ఓ అధ్యయనం ప్రకారం 65 శాతం కుటుంబాలు తమ పిల్లలు అన్నం తినడానికి ఫోన్లు, టీవీలు చూపిస్తున్నారు.
- 12 నెలల వయసున్న పిల్లలు రోజుకు 53 నిమిషాలు స్మార్ట్‌ఫోన్ చూస్తున్నారు. 3 సంవత్సరాల పిల్లలు గంటన్నరకు పైగా చూస్తున్నారు.
- చరవాణి అతిగా వాడే పిల్లల్లో మెదడు, వినికిడి, మాట్లాడే సామర్థ్యంపై ప్రభావం పడుతుందని వెల్లడైంది. ఏకాగ్రతను, నేర్చుకునే సామర్థ్యాన్ని వారు కోల్పోతున్నారు.

తల్లిదండ్రులు ఏం చేయాలంటే...



- పిల్లలకు వీలైనంత వరకు డిజిటల్ తెరలకు దూరంగా ఉంచడమే శ్రేయస్కరం. శారీరక శ్రమ కలిగించేలా ఆటలు ఆడించడం, నైపుణ్యాలను పెంచే విధంగా తల్లిదండ్రులు వారికి సూచనలు చేయాలి. నెమ్మదిగా ప్రయత్నిస్తే ఇది సాధ్యమే.
- పిల్లలున్న సమయంలో తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్ వాడకపోవడం మంచిది. లేదంటే పెద్దలు చూసే సామాజిక మాధ్యమాలు, వీడియోలు, రీల్స్‌కు త్వరగా అలవాటు పడతారు. ముఖ్యంగా గేమ్స్ ఆడకుండా చూడాలి.
- బడి నుంచి ఇంటికి రాగానే దగ్గరుండి వారితో హోమ్‌వర్క్ చేయించాలి. స్మార్ట్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాల గురించి తరచూ పిల్లలకు వివరించాలి.

కుంగుబాటుకు కారణం



స్మార్ట్ఫోన్‌తో ఎక్కువ సమయం గడిపే వారు ఎవ్వరితో మాట్లాడరు. ఆడుకోరు. తల్లిదండ్రులతో అరవడం, వాగ్వాదం చేస్తుంటారు. మానసికంగా కుంగిపోతారు. సెల్‌లో గేమ్స్ ఎక్కువగా ఆడటం వల్ల డిప్రెషన్‌లోకి వెళ్తారు. ఈ మధ్య ఇలాంటి కేసులు ఎక్కువగా వస్తున్నాయి. తల్లిదండ్రులు ఆటలు ఆడించడం, వారితో కలసి ఆడటం, తోటి పిల్లలతో కలిసేలా చేయడం తదితరాలు చేయాలి.

-డా.హేమలత, మానసిక వైద్య నిపుణురాలు, గద్వాల

23న పీయూలో క్రీడాకారుల ఎంపికలు

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలో ఈనెల 23 నుంచి రెండు రోజుల పాటు వివిధ పోటీల్లో క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని పీడీ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సౌత్‌జోన్, అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు సంబంధించి బాస్కెట్‌బాల్ పురుషుల విభాగంలో 23న, మహిళల క్రికెట్ 25న, అదే రోజు క్రాస్ కంట్రీ స్త్రీ, పురుషుల విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారుల వయస్సు 17 నుంచి 25 వరకు ఉండాలన్నారు. ప్రస్తుతం వివిధ కళాశాలల్లో చదువుతున్న అభ్యర్థులు, తమ ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు తమిళనాడు, కర్ణాటక, తదితర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీతే లక్ష్యం



పరుగు ప్రారంభోత్సవంలో క్రీడాజ్యోతితో కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి. జానకి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఆదివారం సీఎం కప్ క్రీడా జ్యోతి జిల్లాకు చేరుకోగా స్వాగతం పలికి, క్రీడా జ్యోతి పరుగును కలెక్టర్ ఎస్పీ డి. జానకి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి, పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్‌తో కలసి ప్రారంభించారు. ఈ పరుగు డీఎస్ఏ మైదానం నుంచి మెట్టుగడ్డ డైట్ కళాశాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీఎం కప్ క్రీడా టోర్నీని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకంగా ఈ సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామీణ స్థాయి నుంచి మండల, జిల్లా రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సాట్స్ ప్రతినిధులు రతన్‌బోస్, గోకుల్ యాదవ్, సాయిబాబా, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి గౌడ్, డీవైఎస్‌వో ఎస్. శ్రీనివాస్, కౌన్సిలర్ రాంలక్ష్మణ్, క్రీడా సంఘాల ప్రతినిధులు, శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారులు ర్యాలీలో పాల్గొన్నారు.

జాతీయ సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో జిల్లా వాసికి రజతం



కె.కార్తిక్

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: బెంగళూరులో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించిన 5వ సౌత్‌జోన్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా వాసికి రజతం దక్కింది. మహబూబ్‌నగర్‌కు చెందిన కె.కార్తిక్ హెప్టఅత్లాన్ విభాగంలో ప్రతిభ చాటి రజతం కైవసం చేసుకున్నాడు. రాష్ట్రానికి రజతం సాధించిన అథ్లెట్‌ను అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి జి. శరత్‌చంద్ర, ఉపాధ్యక్షుడు రాజేంద్ర కుమార్, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి పుట్టి సురేశ్ చందర్, సభ్యులు ఆనంద్, సాదిఖ్, సునీల్ తదితరులు అభినందించారు.

ప్రజల రక్షణకు ప్రాణత్యాగాలు

ఉమ్మడి జిల్లాలో అమరులైన 39 మంది పోలీసులు

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ నేరవిభాగం



శాంతి భద్రతలు, ప్రజల రక్షణకు.. రాత్రింబవళ్లు పని చేసేది పోలీసులే. ప్రజలంతా హాయిగా నిద్రపోతుంటే వారు గస్తీ కాస్తుంటారు. అందరూ పండగ చేసుకుంటే వారు బందోబస్తులో తలమునకలుగా ఉంటారు. అలాంటి పోలీసులు విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు కూడా చేశారు. ఉమ్మడి జిల్లాలో 39 మంది పోలీసు అధికారులు, సిబ్బంది అమరులయ్యారు. అలాంటి పోలీసుల సేవలు, త్యాగాలను గుర్తు చేసుకుని వారికి నివాళి అర్పించేందుకు ఏటా అక్టోబర్ 21న **'పోలీసు అమరవీరుల సంస్మరణ దినం'** నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1990-2000 మధ్య కాలంలో మావోయిస్టుల ప్రాబల్యం తీవ్రంగా ఉండేది. అచ్చంపేట, అమ్రాబాద్, కొల్లాపూర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, గద్వాల, వనపర్తి, వీపనగండ్ల, పెద్దకొత్తపల్లి, పాన్‌గల్, కొత్తకోట, మక్తల్, కృష్ణ, వెల్దండ, వంగూరు, బల్మూరు తదితర ప్రాంతాల్లో మావోయిస్టు దళాలు ఉండేవి. ప్రధానంగా నల్లమల అటవీ ప్రాంతంలో వారి ప్రభావం చాలా ఎక్కువగా ఉండేది. మావోలు గుర్తించకుండా పోలీసు అధికారులు, సిబ్బంది సాధారణ దుస్తుల్లోనే విధులు నిర్వహించేవారు. ప్రత్యేక వాహనాల్లో ప్రయాణించేవారు కాదు. ట్రాక్టర్లు, లారీలు, బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో రాకపోకలు సాగించేవారు. మందుపాతరలు, ఎదురుకాల్పులు సర్వసాధారణం. ఎప్పుడు ఎక్కడ ఏ ఘటన జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇలాంటి క్లిష్ట సమయంలో పోలీసులు ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించారు.

బస్సును పేల్చిన ఘటనలో..

ఉమ్మడి జిల్లాలో మావోయిస్టులు జరిపిన దాడుల్లో అతి పెద్ద ఘటన సోమశిలదే. కొల్లాపూర్ సమీపంలోని సోమశిల వద్ద కొందరు మావోయిస్టులు 1993 నవంబర్ 13న ఆర్టీసీ బస్సును దగ్ధం చేయటంతో పాటు అక్కడే ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని మందు పాతరతో పేల్చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించడానికి 14వ తేదీన అప్పటి ఉమ్మడి జిల్లా ఎస్పీ పరదేశీ నాయుడు, వనపర్తి డీఎస్పీ, ఇద్దరు ఎస్సైలు, 30 మంది వరకు పోలీస్ సిబ్బంది ఒక ప్రైవేటు బస్సులో వెళ్లారు. బస్సు టాప్‌పై ఉన్న ఆయుధాలను గమనించిన మావోయిస్టులు అందులో ఉన్నది పోలీసులేనని నిర్ధారించుకున్నారు. సోమశిలకు వెళ్లి వివరాలను తెలుసుకున్న ఎస్పీ, పోలీసులు తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో మందుపాతరతో బస్సును పేల్చేశారు. వెంటనే కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఎస్పీ పరదేశీ నాయుడుతో పాటు ఇద్దరు ఎస్సైలు, ఆరుగురు పోలీసులు మృతిచెందారు. ఈ ఘటన అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో సంచలనంగా మారింది. 1997 మే 17న అమ్రాబాద్ నుంచి ఎస్సై మన్సూర్ తన సిబ్బందితో కలిసి జీపులో వెళ్తుండగా అదే మండలంలోని లక్ష్మాపూర్ వద్ద మావోయిస్టులు మందు పాతరతో వాహనాన్ని పేల్చేశారు. ఈ ఘటనలో ఎస్సైతో పాటు మరో నలుగురు పోలీసులు చనిపోయారు. 2015లో సూర్యాపేట ఆర్టీసీ బస్టాండులోని ఓ బస్సులో తనిఖీలు నిర్వహిస్తుండగా ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో జడ్చర్లకు చెందిన ఎస్సై సిద్దయ్య అసువులు బాశారు. ఇలా అనేక ఘటనల్లో పోలీసులు ప్రాణత్యాగం చేశారు. వారిని స్మరిస్తూ ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్‌తో పాటు వివిధ కార్యక్రమాలు, విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్రస్థాయి టోర్నీ నేపథ్యంలో ముందస్తుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా టోర్నీ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఎండీసీఏ మైదానంలో 21 నుంచి 28 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట, కొడంగల్ జట్లు పాల్గొంటున్నాయి. పూల్-ఏలో మూడు, పూల్-బిలో మూడు జట్లను విభజించి ఒక్కో జట్టు మూడు మ్యాచ్‌ల చొప్పున ఆడాల్సి ఉంటుంది. ఈ వన్డే టోర్నీలో పూల్-ఏ విన్నర్‌తో పూల్-బి విన్నర్ జట్టు ఫైనల్‌లో తలపడతుంది. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే 16 మంది క్రీడాకారులతో ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టును ఎంపిక చేయనున్నారు. ఎంపికయ్యే ఉమ్మడి జిల్లా జట్టు నవంబర్ 4వ తేదీ నుంచి వరంగల్, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో నిర్వహించే అండర్-23 రాష్ట్రస్థాయి హెచ్‌సీఏ టోర్నీలో పాల్గొంటుంది.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాలమూరుకు ద్వితీయ స్థానం

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో నిజామాబాద్ జట్టు మొదటి, మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ, మెదక్ జట్టు తృతీయ పతకాలు సాధించినట్లు వరంగల్ జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్ తెలిపారు. రామగుండం స్పెషల్ బ్రాంచ్ సీఐ కంప రవీందర్, ఎనుమాముల సీఐ రాఘవేందర్ విజేతలకు బహుమతులు అందజేశారు. వరంగల్ రెడ్డిపాలెంలోని ఇన్ఫాంట్ జీసస్ కాన్వెంట్ పాఠశాలలో ఆదివారం జరిగిన ముగింపు సమావేశాల్లో ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. జీవితంలో గెలుపు కోసం నిరంతరం శ్రమించాలని క్రీడాకారులకు సూచించారు. సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి పూజారి అశోక్‌బాబు, బీమగాని ముఖర్జీ, పాఠశాల ప్రిన్సిపల్ మరియమ్మ మ్యాథ్యూ తదితరులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

వంగూరు, న్యూస్‌టుడే : డిండి ఎత్తిపోతల (డీఎల్ఐ) కాలువ పనుల్లో భాగంగా మండలంలోని నర్సంపల్లి గ్రామ సమీపంలో బ్లాస్టింగ్ చేస్తున్నారు. ఆదివారం బ్లాస్టింగ్ సందర్భంలో అదే గ్రామానికి చెందిన ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. నర్సంపల్లి గ్రామానికి చెందిన దేరంగుల శ్రీను, కృష్ణవేణి దంపతుల కుమారుడు రిషితేజ వంగూరులో 10వ తరగతి చదువుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న డీఎల్ఐ కాలువ పనుల వద్ద గుత్తేదారుడు బ్లాస్టింగ్ చేయడంతో రాళ్లు చాలా దూరం వేగంగా వచ్చి పడుతున్నాయి. ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న రిషితేజకు ఓ రాయి వేగంగా వచ్చి తగిలింది. చేతికి తీవ్ర గాయాలతో కింద పడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వెల్దండ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు.

ఆలయాల్లో భక్తుల రద్దీ

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ శైవక్షేత్రం దక్షిణకాశీ బాలబ్రహ్మేశ్వర స్వామి, అయిదో శక్తిపీఠమైన జోగులాంబ ఆలయాల్లో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర రాష్ట్రాల భక్తులు సైతం తరలి వచ్చారు. స్వామికి అభిషేకం, స్పర్శదర్శనం, జోగులాంబ అమ్మ వారికి త్రిశతి, ఖడ్గమాల, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మ వారికి భక్తులు చీరలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం అనంతరం ఆలయాల సమీపంలోని తుంగభద్ర నదిలో పడవలో చెక్కర్లు కొడుతూ ఆహ్లాదంగా గడిపారు. పుష్కర్ ఘాట్ నుంచి నది పరవళ్లను తిలకించారు.



జోగులాంబ ఆలయంలో భక్తులు

27న అన్నమాచార్య సంకీర్తనాలాపన

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం తిరుమలదేవుడి గుట్టలో వెలసిన శ్రీతిరుమలనాథస్వామి ఆలయంలో ఈనెల 27న శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 54 సంకీర్తనల గానాలాపన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టనున్నట్లు గాయకుడు, అన్నమయ్యవాణి లలిత సంగీత విద్యాలయం వ్యవస్థాపకులు గద్వాల చంద్రశేఖర్‌రావు వెల్లడించారు. లోకకల్యాణార్థం 27వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గానకచేరి ఉంటుందని తెలిపారు.

సిగరెట్ల ఏజెన్సీలో భారీ చోరీ



సీసీ కెమెరా పుటేజీలో గూడ్స్ వాహనంలో సిగరెట్ల కార్టన్లు పెడుతున్న దొంగలు

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్లలో దొంగలు తెగబడ్డారు. ఆదివారం తెల్లవారుజామున పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న సిగరెట్ల ఏజెన్సీ తాళాలు ధ్వంసం చేసి భారీ మొత్తంలో సిగరెట్లను గూడ్స్ వాహనంలో తీసుకెళ్లారు. బాధిత వ్యాపారి, ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం.. జడ్చర్ల రైల్వే స్టేషన్ సమీప కాలనీలో విఘ్నేశ్వర ఏజెన్సీకి సంబంధించిన హోల్‌సేల్ దుకాణం ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు గూడ్స్ వాహనం తీసుకొచ్చి దుకాణం తాళాలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. వివిధ బ్రాండ్లకు చెందిన 32 కార్టన్ల సిగరెట్లను ఎత్తుకెళ్లారు. ఉదయం 6 గంటలకు ఏజెన్సీ ఎదుట కిరాణం నిర్వహించే వ్యాపారి.. తాళం ధ్వంసమై ఉండటాన్ని గుర్తించి యజమానికి సమాచారం ఇచ్చారు. దుకాణం సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా తెల్లవారుజామున 3 గంటల తర్వాత దొంగలు గూడ్స్ వాహనంలో వచ్చి సిగరెట్ల కార్టన్లు తరలిస్తున్న దృశ్యాలు కనిపించాయి. రూ.32 లక్షల విలువైన సిగరెట్లు పోయాయని బాధితుడు మణికాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఇదే ఏజెన్సీలో రెండేళ్ల క్రితం రూ.5లక్షల విలువైన సామగ్రి, నగదు అపహరించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 గం. నుంచి మ.1 వరకు

నాగర్‌కర్నూల్	7993300530
అచ్చంపేట	8008573927
కల్వకుర్తి	9908803650
కొల్లాపూర్	8008573870

? కొల్లాపూర్ పట్టణ సమీపంలోని సోమశిల గ్రామానికి వెళ్లే దారిలో రహదారిపై చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. శని, ఆదివారాల్లో ఈ దారిలో పర్యాటకులు అధిక సంఖ్యలో సోమశిలకు వెళ్తుంటారు. దుర్వాసనతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. – శేఖర్

✔ వెంటనే తొలగిస్తాం.. చెరువు కట్టపై చెత్త వేయడం, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, పురపాలక కమిషనర్, కొల్లాపూర్

? కొల్లాపూర్ పట్టణంలో మాధవస్వామి ఆలయ ప్రధాని పక్కన మట్టి, సిమెంట్ ఇటుకలు, తదితర సామగ్రి వాటితో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మూలమలుపు ప్రాంతంలో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. – సత్యనారాయణ

✔ రహదారుల పక్కన వృథాగా ఉన్న వాటిని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. – శ్రీనివాసులు, కమిషనర్, కొల్లాపూర్ పురపాలిక

- న్యూస్‌టుడే, కొల్లాపూర్ పట్టణం, కొల్లాపూర్

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రవి : దేవర, రమణ : వేట్టయన్ ద హంటర్, రామకృష్ణ : ఇద్దరు
కల్వకుర్తిలో.. పార్థసారథి : దేవర
అశోక్ : వేట్టయన్ ద హంటర్

కూరగాయల ధరలు కిలో.. రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాటా 65, వంకాయ 40, బెండ 45, మిరప 50, కాకర 65, బీర 60, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 45, క్యారెట్ 65, దొండ 50, ఆలుగడ్డ 45, ఉల్లిగడ్డ 45, గోరు 65, దోస 40, ఆనపకాయ 18, చిక్కుడు 65, ముల్లంగి 80, బీట్‌రూట్ 50, బీర 45, బీన్స్ 95

బాధిత కుటుంబానికి సాయం

చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే : చారకొండ మండలం గోకారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన పంజుగుల లక్ష్మయ్య కుటుంబసభ్యులను ఆదివారం భారాస నాయకులు పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రూ.10వేలు, భారాస నాయకుడు ఆంజనేయులు రూ.10వేలు, ఆర్ఎస్‌రెడ్డి రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి పరశురాములు, బ్రహ్మచారి, తిరుపతి, సాయి, అనిల్ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే: వెన్నచర్లలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వడ్డెర శైలేష్ కుటుంబాన్ని ఆదివారం జిల్లా వడ్డెర సంఘం నాయకులు పసుపుల నర్సింహా, బాలస్వామి, మల్లేశ్, నరేందర్ పరామర్శించారు. నగదు అందజేశారు.

విద్యార్థులకు పోలీసుల ప్రత్యేక పోటీలు

నేడు అమర వీరుల సంస్మరణ దినోత్సవం

అచ్చంపేట, బిజినేపల్లి, న్యూస్‌టుడే : పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఏటా అక్టోబరు 21న నిర్వహిస్తారు. ప్రస్తుతం పోలీసు శాఖ ఈ సందర్భంగా ప్రత్యేక పోటీలు నిర్వహిస్తోంది. విద్యార్థులతో పాటు పోలీసు సిబ్బందికి కూడా పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్నారు.



అచ్చంపేటలో పోలీసు అమర వీరులకు కొవ్వొత్తుల ర్యాలీతో నివాళి అర్పిస్తున్న పోలీసులు, విద్యార్థులు (పాత)

అంతర్జాలంలో వ్యాసరచన.. : విద్యార్థులకు అంతర్జాలంలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు విచక్షణతో కూడిన చరవాణి వినియోగం, డిగ్రీ ఆపైస్థాయి చదువుతున్న విద్యార్థులకు మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. అర్హులైన విద్యార్థులు నిర్దేశించిన అంశాలపై అంతర్జాలం వేదికగా వ్యాసరచన పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో రాసిన వ్యాసాలను ఈ నెల 25లోపు పంపించేందుకు అవకాశం కల్పించారు.

పోలీసు సిబ్బందికి.. : పోలీసు శాఖలో వివిధ స్థాయుల్లో పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి కూడా ప్రత్యేక పోటీలు నిర్వహిస్తున్నారు. పోలీసు కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు సమాజంలో పోలీసు ప్రతిష్ఠ మెరుగుపరచడంలో నా పాత్ర, ఎస్సై నుంచి ఆపైస్థాయి అధికారి వరకు దృఢమైన శరీరంలో దృఢమైన మనసు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో రాసేందుకు అవకాశం కల్పించారు.

నేడు మెగా రక్తదాన శిబిరం.. : పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. లయన్స్ క్లబ్ సహకారంతో పోలీసు స్టేషన్ ఆవరణలో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ ఎస్.శ్రీనివాసులు, ప్రతినిధులు వెంకటేశ్, పోల శ్రీనివాసులు, శివశంకర్ సహకారంతో నిర్వహిస్తున్న శిబిరంలో ఎక్కువ మంది పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

సామాజిక పరివర్తనే సంఘం లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

అమ్రాబాద్, న్యూస్‌టుడే: సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యం చేసి దేశాన్ని ఐకమత్యంగా ఉంచేందుకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పనిచేస్తుందని ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆర్ఎస్ఎస్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం ర్యాలీ, సమావేశం నిర్వహించారు. సామాజిక పరివర్తనతో పాటు ధర్మ సంరక్షణ కోసం సంఘం పని చేస్తుందన్నారు. కుల మతాలతో సంబంధం లేకుండా దేశవ్యాప్తంగా ఎన్నో సందర్భాల్లో బాధితులను ఆదుకున్నట్లు చెప్పారు. దేశ విచ్ఛిన్నం కోసం కొన్ని విదేశీ శక్తులు పనిచేస్తు హిందువుల్లో విభజన సృష్టించే పనిలో ఉన్నట్లు చెప్పారు. విదేశీ శక్తుల పాలనలో దేశ సంస్కృతి, దేవాలయాలు నాశనమయ్యాయని బలవంతపు మతమార్పిళ్లు జరిగాయని చెప్పారు. దేశంలో మళ్లీ అటువంటి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందన్నారు. యువకులు దేశ, ధర్మ రక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సంఘ్ పూర్ణ వీధుల గుండా పథ సంచలనం నిర్వహించారు. మహిళలు మంగళహారతులు, పూల వర్షం కురిపించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో విభాగ్ సహ ప్రముఖ్ భాషామని రవి, జంక కార్యవాహ సంబు శ్రీనివాసులు, ముఖ్య అతిథి మాలె శంకరయ్య, అమ్రాబాద్, పదర మండలాల స్వయం సేవకులు పాల్గొన్నారు.



అమ్రాబాద్‌లో పథ సంచలనం నిర్వహిస్తున్న స్వయం సేవకులు

కల్వకుర్తికి గత వైభవం తీసుకురావాలి



చంద్రోదయం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పుర ఛైర్మన్ సత్యం, కవి లక్ష్మణమూర్తి తదితరులు

కల్వకుర్తి, న్యూస్‌టుడే: కవులు కల్వకుర్తికి గత వైభవం తీసుకు రావాలని పుర ఛైర్మన్ సత్యం కోరారు. ఆదివారం పట్టణంలో అల్వాల లక్ష్మణమూర్తి రచించిన చంద్రోదయం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అక్షరభారతి సమితి అధ్యక్షుడు రామశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పుర ఛైర్మన్ మాట్లాడారు. కవులకు పుట్టినిల్లుగా ఈ ప్రాంతం పేరుగాంచిందని, సమాజానికి ఉపయోగపడే సాహిత్యం వెలుగులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు రుక్మాంగదరెడ్డి, యాదగిరాచారి, రఘురాములుగౌడ్, నారాయణగౌడ్, జైపాల్, భీమలింగంగౌడ్, శ్రీనయ్య గౌడ్, విశ్రాంత ఉద్యోగులు ఎపీమల్లయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాత పూర్వక హామీతో సమ్మె విరమణ

కందనూలు, న్యూస్‌టుడే : పురపాలక సంఘం పరిధిలోని పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు ఈనెల 15లోపు పరిష్కరిస్తామని కమిషనర్ నరేశ్‌బాబు రాత పూర్వకంగా హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య పేర్కొన్నారు. ఆదివారం పారిశుద్ధ్య కార్మికులు రెండో రోజు విధులు బహిష్కరించి పట్టణంలోని పాత కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2021 నుంచి బకాయిలు, జనవరి నుంచి రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాలు కార్మికులకు వెంటనే చెల్లించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుండా అధికారులు కార్మికులను బెదిరింపులకు పాల్పడటం సరైన విధానం కాదన్నారు. ఈనెల 15లోపు హామీలు అమలు చేయకపోతే నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పురపాలక కౌన్సిలర్లు శ్రీనివాసులు, నిజాం, నాయకులు ఆర్.శ్రీనివాసులు, కందికొండ గీత, శేఖర్, భీముడు, సత్యం, వెంకటయ్య పాల్గొన్నారు.

కర్వెన జలాశయం పూర్తిచేయాలి: సీపీఎం

భూత్పూర్, న్యూస్‌టుడే: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న కర్వెన జలాశయాన్ని పూర్తి చేసి, సాగు, తాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. భూత్పూర్ పట్టణ పరిధిలోని అమిస్తాపూర్‌లో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. నాయకులు కిల్లె గోపాల్, శ్రీశైలం, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి ఎస్సైగా శ్రీనివాసులు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : బిజినేపల్లి ఎస్సైగా శ్రీనివాసులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ సీసీఎస్‌లో విధులు నిర్వహించిన శ్రీనివాసులు బదిలీపై బిజినేపల్లికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన నాగశేఖర్‌రెడ్డి నాగర్‌కర్నూల్ వీఆర్‌కు బదిలీ అయ్యారు.

ఆరోపణలపై దృష్టి సారించాలి

కందనూలు, న్యూస్‌టుడే : జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులపై వస్తున్న ఆరోపణలపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య, దళిత టీచర్స్ యూనియన్, స్టేట్ టీచర్స్ యూనియన్ సంఘం నాయకులు వెంకటేశ్వరం నిరంజన్, వడ్డేమాన్ విష్ణుమూర్తి, గుడిపల్లి నిరంజన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కలెక్టరేట్‌లో ఆదివారం డీఈవో గోవిందరాజులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రశాంతమైన వాతావరణంలో పని చేయడానికి జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, జానయ్య, అర్జున్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలెవరూ ఆందోళన చెందొద్దు

అమ్రాబాద్, న్యూస్‌టుడే: నల్లమలలో పెద్ద పులి సంచరిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ అవుతోంది. పలువురు తమ స్టేటస్‌లలో వీడియోను ఉంచారు. సుమారు ఒక నిమిషం నిడివిగల వీడియోలో పెద్దపులి అటవీ ప్రాంతంలోని బీటీ రహదారిపై నెమ్మదిగా నడుచుకుంటూ వెళుతున్నట్లు దృశ్యం ఉంది. వీడియో గురించి అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యం ఎఫ్‌డీవో రామమూర్తి దృష్టికి తీసుకెళ్లగా.. మన ప్రాంతానికి చెందినది కాదని, వీడియోలోని పులి మన ప్రాంతంలో ఉన్న ఏ పెద్ద పులి చిత్రంతోను సరిపోలటం లేదన్నారు. ప్రజలెవరు ఆందోళన చెందొద్దని అటవీ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తున్నారని అప్రమత్తంగా ఉన్నట్లు చెప్పారు.

రానున్న విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తి



తూడుకుర్తిలో స్థలపరిశీలన చేసి మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మల్లురవి సూచించారు. ఆదివారం మండలంలోని తూడుకుర్తి గ్రామంలో 25 ఎకరాల్లో రూ.125 కోట్లతో చేపట్టిన పనులను ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే డా. రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. 25 ఎకరాల్లో చేపట్టే పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లురవి మాట్లాడారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అన్ని కులాల విద్యార్థులు ఒకే దగ్గర చదువుకోవడానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నాలుగు వేల మంది విద్యార్థులు చదువుకునేలా వసతి గృహంతో పాటు పాఠశాల నిర్మాణం పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇక్కడే నిర్మించే పాఠశాల భవనం రాష్ట్రంలోనే ఆదర్శ భవనంగా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ పాఠశాలలు ఉపయోగపడుతాయన్నారు. అందుబాటులో ఉంటూ ఈ పనులను నిరంతరం పర్యవేక్షణ చేస్తానన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మినుము పంట చేతికొచ్చేనా?



కోడేరు : వర్షపు నీటిలో మినుము మొలకలు

కోడేరు, న్యూస్‌టుడే : వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో మినుము పంటలు దెబ్బతింటున్నాయి. రబీలో రైతులు సాగు చేసుకున్న మినుము పంట మొలకల దశలోనే ఉన్నాయి. అధిక వర్షాలతో కొన్నిచోట్ల విత్తనాలు మొలకెత్తకుండా భూమిలోనే మురిగిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో దాదాపు 3 వేల ఎకరాల్లో మినుములు సాగు చేశారు. 40 శాతం పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దెబ్బతిన్న పంటలను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని రైతులు కోరతున్నారు.

సేంద్రియ ఎరువులతో లాభదాయకం

అచ్చంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువుల ద్వారా పంటలు సాగు చేసుకుంటే ఖర్చు తగ్గుతుందని ఐసీఐసీఐ ఫౌండేషన్ డీవో లింగస్వామి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని సింగారం, ఐనోల్ గ్రామాలలో రైతులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ పరికరాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు చరణ్, రవీందర్, రైతులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా ఏకం కావాలి



మాట్లాడుతున్న శ్రీశైలం

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 27న జరిగే మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ తాలూకా ప్రచార కార్యదర్శి కుంద ఆంజనేయులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వర్గీకరణ వ్యతిరేక కమిటీని ఎన్నుకున్నారు. మల్లేష్, శ్రీశైలం, ఆనంద్, శ్రీనివాసులు, అశోక్, రామకృష్ణ, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : మాలల ఆత్మగౌరవ సభకు హాజరై మాలలు తమ ఐక్యతను చాటాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చింత సతి అన్నారు. ఆదివారం తిమ్మాజిపేటలో నిర్వహించిన మాలల సభలో మాట్లాడారు. ఈనెల 27న నాగర్‌కర్నూల్‌లో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలన్నారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మాధవులు, నాయకులు ప్రవీణ్‌కుమార్, చెన్నయ్య, భాస్కర్, శివ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : సేవాదృక్పథంతో అనేక మంది పేద విద్యార్థులకు తన విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యనందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని విమర్శించడం సరికాదని కాంగ్రెస్‌పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజకీయాలను అడ్డుపెట్టుకుని ధనార్జనే ధ్యేయంగా భూ దందాలు చేసిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఎమ్మెల్యేను విమర్శించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచి ఆనంద్‌కుమార్, కౌన్సిలర్‌లు లక్ష్మి, శ్రీను, ఎజాజ్, బాలునాయక్, నాయకులు షాన్‌వాజ్‌ఖాన్, రేష్మా, రమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కల్వకుర్తి పట్టణం : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96లో పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. స్నేహితులంతా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

రేషన్ దుకాణాలు అందుబాటులో లేక అవస్థలు

లింగాల, న్యూస్‌టుడే : రేషన్ దుకాణాలు అందుబాటులో లేక వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. శ్రీరంగాపురం, ఎంసీ తండా, డీసీ తండా ప్రజలు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న అప్పాయిపల్లికి, ఎర్రపెంట చెంచులు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెన్నంపల్లికి, మగ్దూంపూర్ ప్రజలు కొత్తకుంటపల్లి, బక్కన్న గుడెం, పాత రాయవరం ప్రజలు రాయవరం, కొత్త చెరువు తండా వాసులు 4 కిలోమీటర్ల దూరం ఉన్న అంబడిపల్లికి వెళ్లి రేషన్ తెచ్చుకొంటున్నారు. కిలోమీటర్ల దూరం వెళ్లి బియ్యం తెచ్చుకోటానికి ఇబ్బందులు పడుతున్నట్లు వినియోగదారులు తెలిపారు. జనాభా ప్రకారం రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ జప్తు

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : దుందుభి వాగునుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను జప్తు చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎల్లికల్ కూడలిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ట్రాక్టర్ పట్టుబడిందన్నారు.

రైతు భరోసా ఇవ్వాలని భారాస నిరసన

ఎన్నికల హామీ రైతు భరోసాను వెంటనే అమలు చేయాలని భారాస నాయకులు డిమాండ్ చేశారు. పంటల సీజన్ ముగుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సాయం అందించకుండా కాలయాపన చేస్తుండటం దారుణమని నిరసన వ్యక్తం చేశారు.



వెల్దండ : జాతీయ రహదారిపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న భారాస నాయకులు

అచ్చంపేట టౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో భారాస ఆధ్వర్యంలో నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిలర్ రమేశ్‌రావు, నాయకులు అమినోద్దీన్, కుత్బుద్దీన్, అజయ్‌యాదవ్, పాల్గొన్నారు.



ఊర్కొండలో నిరసన తెలుపుతున్న భారాస నాయకులు

కొల్లాపూర్, న్యూస్‌టుడే : రైతుభరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరిని నిరసిస్తూ ఆదివారం కొల్లాపూర్‌లో భారాస ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందర కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్వకుర్తి : పట్టణ అంబేడ్కర్ చౌరస్తాలో భారాస నాయకులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పుర ఛైర్మన్ సత్యం, కార్మిక నాయకులు సూర్యప్రకాశ్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌గౌడ్, పుర ఉపాధ్యక్షుడు షాహెద్, నాయకులు పుల్లారెడ్డి, యాదగిరిరెడ్డి, లింగం, రుక్నోద్దీన్, పాష పాల్గొన్నారు.

ఉప్పునుంతల : మర్రిపల్లిలోని రైతువేదిక వద్ద పార్టీ శ్రేణులతో కలిసి భారాస మండలాధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.



కొల్లాపూర్‌లో నిరసన తెలుపుతున్న భారాస నాయకులు, కార్యకర్తలు

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలుచేయాలని, ఆరు గ్యారంటీలు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం భారాస ఆధ్వర్యంలో తిమ్మాజిపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మండలాధ్యక్షుడు ప్రదీప్, నాయకులు గోపిగౌడ్, స్వామి, అయాబ్, ఉసేనీ పాల్గొన్నారు.

తెలకపల్లి : మండల కేంద్రం ప్రధాన కూడలిలో భారాస శ్రేణులు గంటకు పైగా ధర్నా చేశారు. గ్రంథాలయ జిల్లా మాజీ ఛైర్మన్ హన్మంత్‌రావు, భారాస మండల కార్యదర్శి కోట్ల శ్రీనివాసులు మాట్లాడారు.

కోడేరు, న్యూస్‌టుడే : బస్టాండు కూడలిలో భారాస నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. మాజీ సర్పంచులు పిట్టల రాములు, వెంకటస్వామి, కోడేరు గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు బొట్టు వెంకటస్వామి, భాస్కర్, రమేశ్, బాలనాగయ్య పాల్గొన్నారు.

వెల్దండ గ్రామీణం : శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై భారాస నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, ప్రభాకర్, నిరంజన్, ఆనంద్, శేఖర్, జోగురవి, ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

అచ్చంపేట న్యూటౌన్ (బల్మూర్) : బల్మూర్ మండల కేంద్రంలో భారాస నేతలు నిరసన తెలిపారు. అమీనోద్దిన్, రమేశ్‌రావు, కుత్బుద్దిన్, నాగయ్య పాల్గొన్నారు.

పదర(అమ్రాబాద్), న్యూస్‌టుడే: అధికారమే లక్ష్యంగా అలవి కాని హామీలనిచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వానిని అమలు పరిచలేక రైతులను మోసం చేస్తుందని పదర జడ్పీటీసీ మాజి సభ్యుడు రాంబాబు అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం పదర మండల కేంద్రంలో రైతులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతు భరోసా ద్వార రైతులకు ఎకరాకు రూ.15 వేలు అందచేస్తామన్న హామీని తుంగలో తొక్కారని ఆరో



పదర మండల కేంద్రంలో ఆందోళన చేస్తున్న భారాస నేతలు, రైతులు



తెలకపల్లిలో ధర్నా చేస్తున్న భారాస నాయకులు

రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం తగదు

అచ్చంపేట, న్యూస్‌టుడే : రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. ఆదివారం అచ్చంపేట టీఎన్‌జీవోస్ భవనంలో నిర్వహించిన పార్టీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. రైతు భరోసా నిధులను ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో జమ చేయక పోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం మాట తప్పుతోందని ఆరోపించారు. సీపీఎం పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. నాయకులు సైదులు, ఎల్.దేశ్యానాయక్, శంకర్‌నాయక్, ఎస్.మల్లేశ్, శివకుమార్, మల్లేశ్, రాములు, నిర్మలమ్మ, వెంకటయ్య, బక్కయ్య, వాల్యానాయక్ పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసునమోదు

జడ్చర్ల, న్యూస్‌టుడే: జడ్చర్ల పట్టణంలోని శ్రీనివాసకాలనీలో నివాసం ఉండే రాగం సతీష్ పోలేపల్లిలోని ప్రైవేటు పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఇంటి సమీపంలో ముగ్గురు వ్యక్తులు అతడిని అడ్డుకొని గొడవకు దిగి దాడి చేశారు. ఈ సంఘటనపై బాధితుడు ఆదివారం ఫిర్యాదు చేయగా నిఖిల్, ఖన్నా, నానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

పురపాలిక అభివృద్ధికి ముడా తోడ్పడాలి

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: పురపాలక అభివృద్ధికి ముడా తోడ్పాటు అందించాలని పురపాలక ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆకాంక్షించారు. ఆదివారం సద్దలగుండులోని ముడా ఛైర్మన్ నివాసంలో లక్ష్మణ్‌యాదవ్ దంపతులను పుర ఛైర్మన్ సత్కరించి అభినందించారు. ప్రత్యేక గ్రేడు పురపాలక సంఘంగా ఉన్న మహబూబ్‌నగర్ 49 వార్డులో విస్తరించి ఉన్న పెద్ద పట్టణమని, ఇక్కడ సమస్యలు అధికంగా ఉండడంతో పాటు అభివృద్ధి చేయాల్సిన వెనుకబడ్డ వార్డులు అనేకం ఉన్నాయని, రాబోవు రోజుల్లో పట్టణాభివృద్ధికి ముడా నుంచి అత్యధిక నిధులు కేటాయించేలా కృషి చేయాలని ఈ సందర్భంగా ముడా ఛైర్మన్ లక్ష్మణ్‌యాదవ్‌ను పుర ఛైర్మన్ కోరారు. ఇందుకు సముఖత వ్యక్తం చేసిన ముడా ఛైర్మన్ పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని భరోసానిచ్చారు

కల్లు తాగి అపస్మారక స్థితిలోకి మహిళ

లింగాల, న్యూస్‌టుడే: కల్తీ కల్లు తాగి అపస్మారక స్థితికి చేరిన మహిళ చికిత్స పొందుతున్న వ్యవహారం ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రాంపురం గ్రామానికి చెందిన మణెమ్మ (38) అయిదు రోజుల క్రితం గ్రామంలో విక్రయించిన కల్లు తాగింది. కల్లు తాగిన కొద్దిసేపటికే ఆమె అపస్మారక స్థితికి చేరుకొంది. కుటుంబ సభ్యులు మణెమ్మను నాగర్‌కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కల్తీ కల్లుతోనే తన భార్య ప్రాణాపాయస్థితికి చేరిందని విచారించి చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రికి ఫిర్యాదు చేసినట్లు భర్త మల్లేశ్ చెప్పారు. కల్లు విక్రయించిన సత్యంగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం తరలింపుపై కేసు నమోదు

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని మరికల్‌కు చెందిన భద్రయ్య రేషన్ బియ్యం తరలిస్తుండటంతో శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెల్సిందే. ఎన్‌ఫోర్స్‌మెంటు ఉపతహసీల్దార్ హేమ్లానాయక్ ఆదివారం పంచనామా నిర్వహించారు. పట్టుబడిన 38.5 క్వింటాళ్ల చౌకబియ్యంగా నిర్ధారించారు. ఆయన ఫిర్యాదు మేరకు మరికల్‌కు చెందిన వ్యాపారి జనుంపల్లి భద్రయ్య, సునీల్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపారు.